

కలెక్టర్‌ను కలిసిన ఉత్సవ సమితి సభ్యులు

ఆదిలాబాద్ అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ రాజార్షిషాను సోమవారం ఆయన కార్యాలయంలో సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దసరా ఉత్సవాల విజయవంతానికి సహకరించిన జిల్లా యంత్రాంగానికి సమితి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో సమితి అధ్యక్షులు ప్రమోద్‌కుమార్ ఖత్రి, రవీందర్, నర్సోజి, సంజీవ్, రాజు, సుభాష్, సత్యం, వేణు, తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలోని పోలీసు అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా న్యాయాధికారి, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు

అమరవీరుల కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటాం

- పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో జిల్లా కలెక్టర్ రాజార్షిషా
- అసువులు బాసిన పోలీసుల స్ఫూర్తిబాటలో పోలీసు యంత్రాంగం : ఎస్పీగౌస్‌ఆలం

6 లో



తలమడుగు బీసీ బాలుర వసతి గృహంలో కూలిపోయిన ప్రహరీ

సమస్యలతో సహవాసం!!

- మరమ్మతులకు నోచుకోని మరుగుదొడ్లు
- ప్రహరీ లేక విష కీటకాల సంచారం
- వసతి గృహంలో వంద మంది విద్యార్థులు

7 లో

కనిపించని పల్లె వెలుగు బస్సులు

- మహాలక్ష్మీ పథకానికి నోచుకోని గిరిజన గ్రామాలు
- కాలినడకనే మైళ్ల దూరం ప్రయాణం
- అవస్థలు పడుతున్న ఏజెన్సీ ప్రాంత వాసులు

7 లో



నేరడిగొండ మండలం కుప్టి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కడెం నది (ఫైల్)

వరద నీరు.. గోదారిపాలు

- జిల్లాలో ఆయకట్టుకు సాగు నీరందక అల్లాడుతున్న అన్నదాతలు
- కడెం నది వరదలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నాలు
- 19 చెరువుల నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్
- గత ప్రభుత్వ హయాంలోనే స్టేజ్-1 అనుమతులు
- ఏడేళ్లుగా నిధులు మంజూరు గాక.. ముందుకు సాగని పనులు
- తాజాగా కేంద్ర ప్రభుత్వానికి అధికారుల ప్రతిపాదనలు
- చెరువుల నిర్మాణం పూర్తయితే వేల ఎకరాలు సస్యశ్యామలం

ఆదిలాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం నమోదయ్యే ఈ జిల్లాలో.. ఆయకట్టుకు సాగు నీరు అందకపోవడంతో అన్నదాతలు అల్లాడుతున్నారు. ఎంతో సారవంతమైన నల్లరేగడి నేలలు అందుబాటులో ఉన్నా.. సాగుకు అవకాశం లేక వర్షాధార పంటలనే సాగు చేస్తున్నారు. ఏటా అధిక వర్షపాతమే నమోదవుతున్నా.. వర్షపు నీటిని ఒడిసి పట్టే అవకాశం లేక వేల క్యూసెక్కుల వరద నీరు గోదారి పాలవుతోంది. ప్రతీసారి వానాకాలం సీజన్‌లో వేల క్యూసెక్కుల వరద నీరు వృధాగా దిగువకు వెళ్తోందని అధికారులు అంచనా వేస్తున్నారు. బోథ్ నియోజకవర్గంలో ప్రవహించే కడెం నది వరదలకు అడ్డుకట్ట వేసేందుకు గతంలో ఎన్నో రకాల ప్రయత్నాలు జరిగాయి. చివరకు నేరడిగొండ మండలం కుప్టి వద్ద బ్యారేజీ నిర్మాణంతో పాటు నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలలో 19 చెరువులను నిర్మించేందుకు గత ప్రభుత్వం నిర్ణయంచింది. దీంతో కడెం నది వరదలకు అడ్డుకట్ట వేయాలని భావించింది. ఇందులో భాగంగానే 2017 లో గత ప్రభుత్వం 19 చెరువులకు నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కానీ ఇప్పటి వరకు నిధులు మంజూరుకాక పోవడంతో పను లు ముందుకు సాగడం లేదు. అయితే గత రెండేళ్ల క్రితం భారీ వర్షాలు, వరదల కారణంగా కడెం ప్రాజెక్టు ప్రమాదకర స్థాయికి చేరుకోవడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. అయినా ప్రభుత్వం ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వరద నీటి అరెస్టు ట్యాంకుల నిర్మాణం వరద ఉధృతిని కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

8 మండలాలు.. 19 చెరువులు


బోథ్ నియోజకవర్గంలోని కడెం నదిలో కలిసి ప్రవహించే వాగులు, ఒర్రెల ఎగువ భాగంలో 19 చెరువులను నిర్మించేందుకు గత ప్రభుత్వం అనుమతించింది. ఈ చెరువుల నిర్మాణం పూర్తయితే.. 10,860 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని అంచనా వేశారు. దీంతో పాటు కడెం నదికి వరద నీరు పోటెత్తకుండా కట్టడి చేసే అవకాశం ఉంటుంది. బోథ్ మండలంలో 4, ఇచ్చోడలో 4, నేరడిగొండలో 2, గుడిహత్నూర్‌లో 3, బజార్‌హత్నూర్‌లో 1, సిరికొండలో 2, తలమడుగులో 2, తాంసి మండలంలో 1కలిపి.. మొత్తం 8 మండలాల రిధిలో 19 చెరువులను నిర్మించేందుకు గత ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ చెరువుల నిర్మాణం పూర్తయితే 1 టీఎంసీ నీటి నిల్వకు అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన చెరువుల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

భూసేకరణకు 46.16 కోట్ల నిధులు

19 చెరువుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు రూ.46.16 కోట్ల నిధులు అవసరమని అధికారులు అంచనా వేస్తూ.. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. దీంతో 2017 నవంబరులోనే రాష్ట్ర ప్రభుత్వం స్టేజ్-1 అనుమతులను ఇచ్చింది. దీనికి గాను ప్రత్యేకంగా జీవో నెం. 930, 980, 951లను జారీ చేసింది. కానీ నిధుల విడుదల లో తీవ్ర జాప్యం జరిగింది. దీంతో ఏడేళ్లుగా అడుగుముందుకు పడలేదు. రీసర్వే పనులను పూర్తి చేసిన నీటి పారుదల, రెవెన్యూ శాఖల అధికారులు భూసేకరణ వివరాలను సిద్ధం చేశారు. సంబంధిత రైతుల జాబితాను సిద్ధం చేసి నిధుల కోసం ఎదురు చూస్తున్నారు. నిధుల విడుదల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో చెరువుల నిర్మాణ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం కావడంతో ఏటా వేల క్యూసెక్కుల వరద నీరు వృధాగా దిగువకు వెళ్తోంది.

కేంద్రానికి ప్రతిపాదనలు

కడెం నది ఎగువ భాగాన 19 చెరువుల నిర్మాణానికి గతంలోనే అనుమతులు ఇచ్చింది. కాని సకాలంలో నిధులు మంజూరు కాక పోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. దీంతో ఇటీవల ఇరిగేషన్ అధికారులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి కృషి సంచార్ యోజన (పీఎంకేఎస్‌వై) పథకం కింద మంజూరు కోసం 19 చెరువుల ప్రతిపాదనలు పంపించారు. అనుకున్నట్లుగానే కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే చెరువుల నిర్మాణ పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. దీంతో వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందడంతో పాటు కడెం నది వరదలకు అడ్డుకట్ట పడనుందని అధికారులు పేర్కొంటున్నారు.





చెరువును నిర్మించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నాం

: నామ్‌వాడే శంకర్, రైతు, ముక్రా(కె)

గత ప్రభుత్వ హయాంలో మంజూరైన చెరువును నిర్మించాలని అధికారుల చుట్టు తిరుగుతున్నాం. ఇప్పటి వరకు చెరువు నిర్మాణం పనులు ప్రారంభం కావడం లేదు. గ్రామ సమీపంలో నుంచే భారీ వరద వెళ్లి కడెం నదిలో కలుస్తుంది. చెరువును నిర్మించక పోవడంతో ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. దీంతో వర్షాధారంగా వానకాల పంటలను సాగు చేస్తూ యాసంగిలో వృదాగానే వదిలేస్తున్నాం. ఇకనైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించి మా గ్రామంలో చెరువును నిర్మించాలి.



కేంద్ర ప్రభుత్వానికి కొత్త ప్రతిపాదనలు పంపిస్తున్నాం

: విఠల్, నీటి పారుదల శాఖ ఈఈ, ఆదిలాబాద్

బోథ్ నియోజక వర్గంలో 19 చెరువులను నిర్మించేందుకు గతంలోనే ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. కానీ ఇప్పటి వరకు భూసేకరణకు నిధులు మంజూరుకాక పోవడంతో పనులు నిలిచి పోయాయి. స్టేజ్ 1 అనుమతులు వచ్చినా ప్రయోజనం లేకుండా పోయింది. మళ్లీ కొత్తగా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నాం. మంజూరుకాగానే పనులను ప్రారంభిస్తాం. చెరువులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో ఆయకట్టుకు సాగు నీరు అందడంతో పాటు కడెం నది వరదలకు అడ్డుకట్ట వేసే అవకశం ఉంటుంది.

ఆదివాసీల ఆందోళన ఉద్రిక్తం!





తుడుందెబ్బ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్, అక్టోబర్ 21 (ఆంధ్ర జ్యోతి) : ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ఆదివాసీలు తుడుందెబ్బ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా ఉద్రిక్తతకు దారితీసింది. ఎలాంటి షరతులు విధించకుండా రైతులందరికీ రుణమాఫీ వెంటనే చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో వరంగల్ డిక్లరేషన్లు ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేపట్టాలని తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొడం గణేష్ పేర్కొన్నారు. రుణమాఫీ వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట తుడుందెబ్బ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. రైతులందరికీ కటాఫ్ లేకుండా రైతుభరోసా వెంటనే ఇవ్వాలన్నారు. క్వింటాల్ పత్తికి మద్దతు ధర రూ.10వేలు ఇవ్వాలన్నారు.

కలెక్టరేట్‌లో ఉద్రిక్తత..

ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట తుడుందెబ్బ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కాస్త ఉద్రిక్తతకు దారితీసింది. ధర్నా అనంతరం కలెక్టరేట్ లోపలికి వెళ్లేందుకు యత్నించగా గేటు మూసివేశారు. కలెక్టరేట్‌కు ఉన్న మరోగేటు నుంచి వారు లోపలికి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు, సిబ్బంది అడ్డుకున్నప్పటికీ పెద్దఎత్తున ప్రజావాణి కార్యాలయం వరకు వచ్చారు. దీంతో పోలీసులు ఆదివాసులకు మధ్య తోపులాట జరిగింది. అనంతరం పోలీసులు కలెక్టర్ రాజర్షిషాకు సమాచారం ఇవ్వగా కలెక్టర్ వారి వద్దకు వచ్చి సమస్యను తెలుసుకొని వినతిపత్రం స్వీకరించారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి..

కలెక్టరేట్ ఎదుట ఆదివాసులు చేపట్టిన ధర్నా ఉద్రిక్తతకు దారి తీసింది. కాగా పోలీసుల తీరు పై ఆదివాసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కు విన్నవించారు. ఆందోళన చేస్తున్న ఆదివాసీ మహిళలపై దుర్భాషలాడిన పోలీసులపై కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా రైతు సమస్యలపై అధికారులకు విన్నవించేందుకు వస్తున్న తమపై పోలీసులు దుర్భాషలాడిన తీరుసరికాదని అన్నారు. అదే విధంగా తమ జెండాలను పోలీసులు తీసేయడం జరిగిందని, పోలీసులు భేషరతుగా క్షమాపణ చెప్పాలని లేదా పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని తుడుందెబ్బ నాయకులు డిమాండ్ చేశారు.

ప్రజావాణిలో వినతుల వెల్లువ

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 21 (ఆంధ్ర జ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వినతులు వెల్లువెత్తాయి. బేల మండలంలోని గణేష్‌పూర్ గ్రామం అటవీ శాఖ పరిధిలో ఉండడంతో పంచాయతీ భవనం కట్టుకోవడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని సోమవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు యువజన కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా అటవీ శాఖ అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో గ్రామానికి ఏళ్లుగా పంచాయతీ భవనం లేదన్నారు. దీని వల్ల గ్రామంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

లింకు రోడ్డు ఏర్పాటు చేయాలని...

జిల్లా కేంద్రంలోని అంకోలి తంతోలి రోడ్డు దగ్గర వార్డ్‌నెంబర్.6 పరిధిలోని కచ్‌కంటి పరిధిలోనిలే అవుట్‌లోని ప్లాట్ యజమానులు మెయిన్ రోడ్డుకు వెళ్లడానికి లింకు రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం అందజేశారు. ప్లాట్ యజమానులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని..

గుడిహత్నూర్ మండలంలోని తోషం ఆశ్రమ పాఠశాలలో సుమారు 320 మంది విద్యార్థులు చదువుతున్నారని, పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో జిల్లాకలెక్టర్ రాజర్షిషాకు వినతి పత్రం అందజేశారు. పాఠశాల ప్రహరీ కూలిపోయిందన్నారు. 320 మంది విద్యార్థులకు 10 మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయన్నారు. అందులో 6 పనిచేయడం లేదన్నారు. నాలుగు మాత్రమే వినియోగించుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో టీపీజేఎస్ జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యువజన కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్అర్బన్ : అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజార్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాట్లాడుతూ స్వీకరించిన అర్జీలను సంబంధింత అధికారులకు అందించి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని పెం డింగ్ పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు ప్రతి పాఠశాలలను సందర్శించాలని, పాఠశాలలో విద్యార్థుల హాజరు, మెనుప్రకారం భోజనం, వసతులపై దృష్టి సారించాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న టీపీజేఎస్ జిల్లా అధ్యక్షులు

శిక్షణాధికారుల పర్యటన

ఆదిలాబాద్అర్బన్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి) : క్షేత్ర పర్యటనకు శిక్షణ ఐఏఎస్, ఐఆర్ఎస్, ఐపీఎస్ అధికారులు ఆలిండియా సర్వీసెస్, సెంట్రల్ సివిల్ సర్వీసెస్ 21 మంది ఆఫీసర్స్ సోమవారం జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజార్షిషా, జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం, అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్‌లతో కలిసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం క్షేత్ర పర్యటనకు వచ్చిన 21 మంది శిక్షణ అధికారులకు స్వాగతం పలికి, వారిని జిల్లా కలెక్టర్ పరిచయం చేసుకున్నారు. జిల్లాలో డీఆర్‌డీఓ, మహిళ శిశు సంక్షేమ శాఖ, విద్యా, మిషన్ భగీరథ, మున్సిపల్, పంచాయతీ, వ్యవసాయ శాఖలకు సంబంధించిన ఆయా శాఖల బ్రీఫ్ నోట్ వివరాలను వారికి వివరించారు. బేలలోని సిర్సన్న, తాంసి మండలం పొన్నారి, జైనథ్ మండలం పెండల్‌వాడ, ఆదిలాబాద్‌రూరల్ గ్రామాలలో వీరు పర్యటించనున్నారని తెలిపారు. మున్సిపాలిటీలోని వార్డులలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేయ డం జరుగుతుందని తెలిపారు. నాలుగు బృందాలుగా ఏర్పడి పలు గ్రామాలు, మున్సి పాలిటీలలో పర్యటిస్తారని తెలిపారు. గ్రామీణ మౌలిక, ఆరోగ్యం, విద్య పారిశుధ్యం, వ్యవసాయ, జీవనోపాధి అంశాలపై పరిశీలన చేయ డం జరుగుతుందన్నారు.

జిల్లా కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ

భోథ్ : ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ జన్మదినాన్ని పురస్కరించుకుని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులున్నారు.

నవంబర్ ఐదు నుంచి రాష్ట్రస్థాయి స్పోర్ట్స్‌మీట్

ఉట్నూర్, నవంబరు21 (ఆంధ్రజ్యోతి) : స్టేట్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా పేర్కొన్నారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో స్టేట్ లెవల్ స్పోర్ట్స్ మీట్ పై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవంబర్ 5 నుంచి 7 వరకు ఉట్నూర్ కొమురంభీం ప్రాంగణంలో నిర్వహించనున్న స్టేట్‌లెవల్ స్పోర్ట్స్ మీట్‌కు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డీడీ జాదవ్ వసం తరావు, ఈఈ భీమ్‌రావు, ఉమ్మడి జిల్లాల డీటీడీఓలు, ఏటీడీఓలు, ఏసీఎంఓలు, స్పోర్ట్స్ అధికారులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి : పీవో

గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ చాంబర్‌లో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. గిరిజన దర్బార్‌లో ఏపీఓ జనరల్ జాదవ్‌వసంత్‌రావు, ఈఈ భీంరావ్, ఏడీఎంహెచ్ఓ డాక్టర్ కుడిమెత మనోహర్, ఏఓ దామోదర్, పీహెచ్ఓ సందీప్‌కుమార్ ఏపీఓ (పీవీటీజీ) మేస్రం మనోహర్ పాల్గొన్నారు.

క్రీడారత్నాలను సన్మానించిన పీవో

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో మెరిసిన ఉట్నూర్ మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆదర్శ క్రీడా పాఠశాలక్రీడాకారులను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కుష్బుగుప్తా ఘనంగా సన్మానించారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ ప్రాంగణంలో జాతీయ స్థాయి ఖోఖో అథ్లెటిక్స్ పోటీలలో పథకాలు సాధించిన గిరిజన విద్యార్థులను సన్మానించి క్రీడా దుస్తులు బహూకరించారు. బంగారు పథకం సాధించిన రాథోడ్ కార్తిక్, కోచ్ శివకృష్ణలను ప్రశంసించారు.

సబ్‌స్టేషన్‌లో సాంకేతిక లోపం..

నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

భోథ్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో సాంకేతిక లోపం ఏర్పడింది. ఫలితంగా మధ్యాహ్నం రెండు గం టల నుంచి అంతరాయం ఏర్పడింది. సాంకే తికలోపం ఏర్పడిన విషయాన్ని జిల్లా ఉన్నతా ధికారులకు ఏఈ వెంకటేష్ సమాచారం అం దించడంతో ప్రత్యేక అధికారుల బృందం విద్యు త్తుసరఫరా అంతరాయం గల కారా ణాలను పరిశీలించారు. సాయంత్రం ఐదున్న రగంటల వరకు సైతం విద్యుత్ సరఫరా కాలే దు. వినియోగదారులు ఇబ్బందులకు గురయ్యారు.

విద్యతోనే విద్యార్థులకు భవిష్యత్తు : జీసీడీవో

నార్నూర్, అక్టోబరు 21 : విద్యార్థుల భవిష్యత్తు విద్యతోనే సాధ్యమని బాగా చదువుకోవాలని అప్పుడే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జీసీడీవో చాయా మేస్రం అన్నారు. సోమవారం మండలంలోని మన్నాపూర్ జామడ ఆశ్రమ పాఠశాలలో బాలికల ఉన్నత పాఠశాలను అకస్మికంగా పర్యటించి విద్యార్థులు రాస్తున్న మొదటిరోజు పరీక్షని విద్యాప్రమాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అక్షరాస్యులైనప్పుడే అన్ని విధాల అభివృద్ధి చెందు తారాన్నారు. నాణ్యమైన విద్యను బోధించాలని సూచించారు.

జిల్లా అభివృద్ధికి కృషి : ఎంపీ

బజార్‌హత్నూర్, అక్టోబర్ 21 : జిల్లా అభివృద్ధికి కృషిచేస్తానని ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు గోడం నగేష్ అన్నారు. ఆయన జన్మదిన వేడుకల కార్యక్రమాన్ని మండల నాయకులు, అభిమానులు స్థానిక తిరుమల ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు తీసుకువచ్చి వెనుకబడిన జిల్లాను ముందుకు తీసుకెళ్తానని అన్నారు. ఎంపీ పుట్టినరోజు సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు షెట్కర్ సురేష్ ఎంపీ చేతులమీదుగా పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. అంతకు ముందు తన సొంత గ్రామం జాతర్లలోని వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తనయుడు గోడం రిత్విక్, దక్షిణ మధ్యరైల్వే సభ్యులు జీవీ రమణ, మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్, సహకార సంఘం చైర్మన్ మేకల వెంకన్న, కదం ప్రశాంత్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

తలమడుగు : ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు జి.నగేష్ జన్మదిన వేడుకలు సోమవారం పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. అదే విధంగా ఎంపీ నగేష్ జన్మదినం సందర్భంగా కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఫోన్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తాంసి మాజీ జడ్పీటీసీ రాజు, బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు కనపర్తి చంద్రకాంత్, మాజీ జడ్పీటీసీ ప్రభాకర్, సుంకిడి మాజీ సర్పంచ్ మహేందర్‌యాదవ్, బీజేపీ సీనియర్ నాయకులు ఎంపీ నగేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆదిలాబాద్ రూరల్ : ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ గొడం నగేష్ పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎంపీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ యా దవ్, లాల మున్న, ఆకుల ప్రవీణ్ పాల్గొన్నారు. ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేష్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీకి బీజేపీ నాయకులు, కౌన్సిలర్లు, అధికారులు, వివిధ సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

బోథ్ : అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదవ్ బలిరాం, బోథ్ మండల మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్‌తో పాటు స్థానిక నాయకులు ఎంపీని కలిసి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



ఎంపీ నగేష్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు,

అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటాం : కలెక్టర్



క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, పోలీసులు

● పోలీసు అమరవీరులకు ఘననివాళి
● పాల్గొన్న ఎమ్మెల్యేలు, అధికారులు

ఆదిలాబాద్అర్బన్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి) :పోలీసు అమరవీరుల కుటుంబాలను జిల్లా యంత్రాంగం తరపున అన్ని విధాలుగా ఆదుకుం టామని కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లోని అమర వీరుల స్థూపం వద్ద జిల్లా ప్రధాన న్యాయాధికారి కె.ప్రభాకర్‌రావు, కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం, రెండోబెటాలియన్ కమాండెంట్ నితికా పంత్, ఎమ్మెల్యేలు పాయలశంకర్, అనిల్‌జాదవ్; ఇతర ఉన్నతాధికారులు, పోలీసు అమరవీరుల కుటుంబసభ్యులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసువులు బాసిన 214 మంది పోలీసు సిబ్బంది, అధికారుల పేర్లను అదనపు ఎస్పీ ఆపరేషన్ బి.సురేందర్రావు చదివారు. ముందుగా స్థూపం వద్ద జ్యోతి వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సాయుధ పోలీసులు నివాళులర్పించారు. జిల్లా పోలీసు యంత్రాంగం, అధికారులు స్థానిక కలెక్టర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించాల్సిన అవసరం ఉందన్నారు. విధి నిర్వహణలో పోలీసులు అనునిత్యం సవాళ్లను ఎదుర్కొంటూ శాంతియుత వాతావరణం నెలకొల్పడానికి వారు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం మాట్లాడుతూ అసువులు బాసిన పోలీసుల స్ఫూర్తిబాటలో జిల్లా పోలీసు యంత్రాంగం కొనసాగుతుందన్నారు. ఇందులో అమర వీరుల కుటుంబ సభ్యులతో పాటు అదనపు ఎస్పీ ఆపరేషన్ బి.సురేందర్‌రావు, డీఎస్పీలు ఎల్.జీవన్‌రెడ్డి, పోతారం శ్రీనివాస్, సీహెచ్ నాగేందర్, డి.సురేందర్‌రెడ్డి, ఇతర శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బోథ్ : పోలీసులు ఉన్నది ప్రజల సంక్షేమం కోసమేనని తమ ప్రాణాలను పాణంగా పెట్టి ఆస్తులను ప్రాణాలను కాపాడి ఎంతో మంది అమరులయ్యారని బోథ్ సీఐ రమేష్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎస్సై ప్రవీణ్ స్థానిక పోలీసులు నాగభూషణం పాఠశాల విద్యార్థులతో కలిసి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో నాగభూషణం, పాఠశాల ప్రిన్సిపాల్ కిషోర్‌కుమార్ ఉన్నారు.

ఉట్నూర్ : ఉట్నూర్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ కొమ్ముగూడ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన ఎస్సై కోటియా, హెడ్‌కానిస్టేబుల్ తయర్ అహ్మద్, కానిస్టేబుల్ గోవర్ధన్‌ల స్థూపం వద్ద ఉట్నూర్ ఎస్సై మనోహర్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి ఎస్సై దుబ్బాక సునిల్‌తో పాటు ట్రైని ఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్‌లు లక్ష్మినారాయణ, నాగన్న, మల్లేష్‌లతో పాటు పోలీసులు పాల్గొన్నారు. సోనాలలోని వివేకానంద పాఠశాల విద్యార్థులు సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నివాళులర్పించారు.



పోలీసు అమరవీరుల స్థూపం

ఆదిలాబాద్ రూరల్ : విధి నిర్వహణలో ప్రాణాలు వదిలిన పోలీసు అమర వీరుల త్యాగ నిరతి చిరస్మరణీయమని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినో త్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పరేడ్ మైదానంలోని పోలీసు అమరవీరుల స్థూపానికి కాంగ్రెస్ నేతలతో కలిసి నివాళులర్పించారు.

● త్యాగనిరతి చిరస్మరణీయం

మావల : శాంతి భద్రతలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంలో పోలీసులది కీలకపాత్ర అని, విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అమరులైన పోలీసుల సేవలు సమాజం ఎప్పటికీ మరిచిపోదని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నా రు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మావల మండల అధ్యక్షులు దర్శపురి చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కుదురుపాక సురేష్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఎస్సై దుబ్బాక సునీల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జడ్పీఎస్ఎస్ పాఠశాల నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

ఆదిలాబాద్అర్బన్ : అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఫ్లాగ్‌డే సందర్భంగా పట్టణంలోని స్థానిక కలెక్టర్ చౌరస్తా నుంచి వినా యక్‌చౌక్ వరకు భారీ క్యాండింగ్ ర్యాలీ నిర్వహిం చారు.ఈ ర్యాలీలో జిల్లా కలెక్టర్ రాజార్షిషా, జిల్లా ఎస్పీ గౌస్ఆలం,జిల్లా పోలీసు అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటు ర్యాలీ కొనసాగింది.



కాగడను వెలిగిస్తున్న అతిథులు

ఘనంగా బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఆదిలాబాద్అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : బేల మండలం సిర్సన్న గ్రామంలో జరిగిన బతుకమ్మ నిమజ్జన కార్యక్రమానికి ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి సతీమణి కంది మౌనారెడ్డి హాజరయ్యారు. తన పుట్టింటికి చేరుకున్న ఆమె ఇంటి బతుకమ్మను ఎత్తుకుని కుటుంబ సభ్యులతో పాటు గ్రామంలోని మహిళలతో కలిసి బతుకమ్మ ఆట పాటలతో పాల్గొన్నారు. మహిళలు చిన్నారులు కోలాటాలతో సందడి చేశారు. అనంతరం గ్రామంలోని రైతువేదిక వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

పిప్పల్‌కోటిలో..

భీంపూర్ : మండలంలోని పిప్పల్‌కోటిలో సోమవారం బతుకమ్మలను సమీప వాగుల్లో నిమజ్జనం చేశారు. రకరకాల పూలతో బతుకమ్మలు అలంకరించిన బతుకమ్మలను గద్దెల పై ఉంచి పూజలు చేశారు. డప్పు వాయిద్యాల నడుమ పాటలు పాడుతూ కోలాటాలు ఆడుతూ అనంతరం బతుకమ్మలను సంప్రదా యబద్ధంగా నిమజ్జనం చేశారు.

తలమడుగు : తలమడుగు మండలం రుయ్యాడి గ్రామంలో ఘనంగా బతుకమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని మహిళలు నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మను ఏర్పాటు చేసి భజ భజంత్రీలతో పుర వీధుల గుండా శోభయామానంగా ర్యాలీగా వెళ్లి స్థానిక బతుకమ్మ వాగు వద్ద బతుకమ్మను నిమజ్జనం చేశారు. అనంతరం మహిళలు ఆటపాటలతో ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.

జీవో 29ని రద్దు చేయాలి : డీటీఎఫ్ డిమాండ్

ఉట్నూర్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి) : జీవో 29ని వెంటనే రద్దు చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ముడుగు శామ్యూల్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌భవన్‌లో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం చేయనున్న ఈ జీవోను వెంటనే రద్దు చేసి పాత జీవో 55 ప్రకారం మాత్రమే ఉద్యోగ నియమకాలు చేపట్టాలని అన్నారు.

అంకిత భావంతో పనిచేయాలి : తహసీల్దార్

తలమడుగు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసినప్పుడే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ రాజమోహన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని పశువైద్యశాలలో గత 14 సంవత్సరాలుగా ఒకే మండలంలో విధులు నిర్వహించి మండలవాసులతో పాటు రైతుల అభిమానాలు పొందడం ఎంతో సంతోషమన్నారు. అదేవిధంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పశువై ద్యాధికారి డాక్టర్ లావణ్య మరిన్ని సేవలు చేసి రైతుల మన్ననలు పొందాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యో గులకు బదిలీలు పదోన్నతులు పదవీవిరమణ సహజమైనప్పటికీ అంకితభావంతో పనిచేసినప్పుడే గుర్తింపు లభిస్తుం దన్నారు. అనంతరం బదిలీపై వెళుతున్న డాక్టర్ దూద్రం రాథోడ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీజడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, ఎంఈ వో వెంకట్‌రావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీర్‌బాబురావ్ వర్ధంతి

ఉట్నూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గుస్సాడి గుట్టరాజ్‌గోండు సేవా సమితి భవన్‌లో సోమవారం స్వాతంత్రం కోసం పోరాడిన గోండు రాజా వంశంలో జన్మించిన వీర్ బాబురావు వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌గోండు సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ స్వాతంత్రం కోసం పోరాడిన బాబురావు యువ వయసులో 1 858 అక్టోబర్ 21న వీరమణం పొందారన్నారు.

మూగజీవాలకు వ్యాధి నిరోధక టీకాలు

ఇచ్చోడ, అక్టోబరు, 21(ఆంధ్రజ్యోతి): కోకస్‌మన్నూర్‌లో సోమవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు నిరోధక టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ తెలిపారు. రైతులందరూ తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలన్నారు.

కోడిపిల్లల పంపిణీ

సిరికొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ఆర్థిక చేయూత అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీడీవో రవీందర్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన, ఏపీఎం సంతోష్‌తో కలిసి సిరికొండలోని మండల సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు కోడి పిల్లలను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మహిళాసంఘాల్లోని సభ్యులకు ఇందిర మహిళ శక్తి పేరిట ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం కోడిపిల్లలను పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ఇందులో భాగంగా మండలంలోని మహిళా సంఘాల సభ్యులకు ఒక్కొక్కరికీ 20 కోడిపిల్లల చొప్పున బ్యాంకు లింకేజీ ద్వారా దాదాపు రూ. 2,59, 600/-విలువ గల కోడిపిల్లలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య కార్యదర్శి, సీసీలు, వీవోలు, మహిళలు పాల్గొన్నారు.

హిందూ సంఘాల నిరసన

ఉట్నూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : హిందువులపై దాడులను ఖండిస్తూ ఉట్నూర్‌లో ధర్నా నిర్వహించారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని నల్లపోచమ్మ ఆలయం వద్ద హిందు సంరక్షణ సమితి ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లు ధరించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాథోడ్‌రితేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఈ మధ్యకాలంలో హిందు దేవాలయాల పై, హిందువుల పై మతోన్మాద శక్తులు దాడులు చేస్తుంటే తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలని అన్నారు. ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహాలు కూల్చిన వ్యక్తికి ప్రభుత్వం కొమ్ముకాయడం సరైంది కాదన్నారు. హిందు జాతిని అవమానపరిచిన వ్యక్తికి ప్రభుత్వం అండగా ఉంటూ నిరసన తెలియజేసిన హిందువుల పై పోలీసుల బలప్రయోగం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హిందువుల పై ఇలాంటి దాడులు మళ్లీ జరిగితే సహించబోమన్నారు. ఈ సందర్భంగా ఉట్నూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గండికోట మొగిలికి మెమోరాండం అందించారు. అక్కడి నుంచి కొందరు ప్రతినిధులు సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని కార్యాలయం పరిపాలన అధికారికి మెమోరాండం అందించారు. కార్యక్రమంలో హిందు సంఘాల నాయకులు సట్ల అశోక్, ఆడేదస్‌లాల్, శ్రీరాంనాయక్,సీపతి లింగాగౌడ్ ఉన్నారు.

కోతులు వెంబడించడంతో
కిందపడి మహిళ మృతి


● నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో విషాదం



లక్ష్మి మృతదేహం

ఖానాపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మృత్యువు ఏ రూపాన కబళిస్తుందో ఎవరికి తెలియదనడానికి నిదర్శనం ఈ ఘటన. అప్పటివరకు తన ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్డు కింద ప్రశాంతంగా పడుకొని ఉన్న ఆ మహిళ ఆ మరుక్షణమే ప్రాణాలు కోల్పోతానని ఊహించి ఉండదు. ఒక్కసారిగా కోతుల మూక తనపై దాడి చేసేందుకు రావడంతో వాటి నుండి తప్పించుకునేందుకు ఇంట్లోకి పరుగులు పెట్టిన ఆమె ప్రమాదవశాత్తూ కింద పడి ప్రాణాలు కోల్పోయిన హృదయ విదారకమైన ఘటన నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఖానాపూర్‌లోని విద్యానగర్‌కు చెందిన బొంగోని లక్ష్మీ(58) అనే మహిళ సోమవారం తన ఇంటి ముందర గల రేకుల షెడ్డు కింద విశ్రాంతి తీసుకుంటోంది. ఇదే సమయంలో ఒక్కసారిగా ఆమె ఇంటి వైపు పెద్ద సంఖ్యలో కోతులు తరలొచ్చాయి. ఈ కోతులమూక ఒకదానిపై ఒకటి దాడి చేసుకోవడంతో పాటు అక్కడే ఉన్న లక్ష్మీపైనా దాడి చేసేందుకు ప్రయత్నించాయి. దీంతో వాటి బారి నుంచి తనను తాను కాపాడుకునేందుకు రేకుల షెడ్డు కింద నుంచి ఇంట్లోకి పరుగులు పెట్టింది. ఈ క్రమంలో ఇంటి ఆవరణలో గల సిమెంట్ ఫ్లోరింగ్‌పై ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడింది. దీంతో లక్ష్మీ తల వెనుక భాగంలో తీవ్ర గాయమైంది. గమనించిన కుటుంబ సభ్యులు లక్ష్మీని హుటాహుటిన ఖానా పూర్ ప్రభుత్వాసుత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతి చెందిన లక్ష్మీకి భర్త గంగా గౌడ్, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

అయ్యప్ప మున్నూరు కాపు సంఘ కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన అయ్యప్ప మున్నూరు కాపు సంఘం కార్యవర్గం

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప మున్నూరు కాపు సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నాళం మదన్మోహన్, గౌరవ అధ్యక్షుడిగా కిషన్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా గంగాప్రసాద్, మధుకర్, కోశాధికారిగా సాయినాథ్, కార్యదర్శిగా గణేష్ ఎన్నికయ్యారు.

పిల్లల్లో పోషకాహార స్థాయిలు మెరుగుపరచండి



మాట్లాడుతున్న డాక్టర్ రాజేందర్

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : తీవ్ర అనారోగ్యంతో పోషకాల లోపంతో బాధపడుతున్న పిల్లల స్థాయిలు పెంపొందించేందుకు మెరుగైన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి రాజేందర్ సూచించారు. సోమవారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ... పోషకాహార లోపాలున్న పిల్లలను గుర్తించి కుటుంబాలకు అవగాహన కల్పించాలన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖతో సమన్వయం చేసుకొని పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డాక్టర్ శ్రీనివాస్, ఆయుష్ వైద్యాధికారులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థిని గెలిపించండి'

ముథోల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరుగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డిని గెలిపించాలని సోమవారం ఒక సమావేశంలో పీఆర్‌టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణరావు కోరారు.


అకాల వర్షంతో నేలకొరిగిన వరి పంట



ముథోల్ మండలంలో నేలకొరిగిన వరి పంటను చూపుతున్న రైతు



ముథోల్ మండలంలో నేలకొరిగిన వరి పంట



భైంసా ప్రాంతంలో కోతదశలోనున్న వరి పైరు దెబ్బతిన్న దృశ్యం

ముథోల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం కురిసిన అకాల వర్షం కారణంగా సోయా దిగుబడులతో పాటు వరి పంటను కూడా తీవ్రంగా నష్టపరిచింది. ఆరుగాలం కష్టించి పండించిన రైతన్న కష్టం వర్షం మింగిందని ఆందోళన చెందుతున్నారు. వరి పంట కొంతమంది రైతులు వరి కోయగా మరికొంత మంది రైతుల వరి పంట 4-5 రోజుల్లో కోతకు రానున్న సమయంలోనే అకాల వర్షం వరి రైతుల ఆశలను ఆవిరి చేసింది. మండలంలోని చించాల, వెంకటాపూర్, ఆష్ట, విట్టోలి, ఎడ్‌బిడ్, వెంకటాపూర్ తదితర గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది. కోతకు వచ్చిన వరి పంట నేలకొరగడంతో రైతన్న తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. ఈ విషయమై ప్రభుత్వం స్పందించి నష్టపరిహారాన్ని చెల్లించాలని రైతులు వేడుకుంటున్నారు. అకాల వర్షం కారణంగా మండలంలోని సోయా పంట తడిసిపోవడంతో పాటు వరి పంట సైతం అడ్డం పడిపోవడంతో నష్టపోయామని రైతులు ఆందోళన చెందుతున్నారు. సర్వే చేసి నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

భారీ వర్షంతో తడిసి ముద్దయిన భైంసా

భైంసా, అక్టోబరు 21 : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో సోమవారం మధ్యాహ్నం వేళలో భారీ వర్షం కురిసింది. ఎకబిగిన గంటన్నర పాటు కురిసిన భారీ వర్షంతో పట్టణమంతా తడిసి ముద్దయ్యింది. అంతర్గత రోడ్లపై వర్షపు నీరు ఉధృతి ప్రవహించగా రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. మురికి కాలువలు పొంగి ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు అధిక మొత్తంలో నిలిచి చిన్న పాటి చెరువులను తలపించాయి. వారంతపు సంతలోని క్రయ,విక్రయదారులు అవస్థల పాలయ్యారు. ఎగువ ప్రాంతం నుంచి వర్షపు నీరు ఉధృతితో రావడం మూలంగా వారంతపు సంతలోని వ్యాపారులు తమ సరుకులు కొట్టుకపోకుండా ఉండేందుకు తంటాలు పడ్డారు. పరిసర ప్రాంతాల్లో కోత దశలోనున్న వరి పైఢ వర్షపు దాటికి దెబ్బతినగా కల్లల్లోని సోయ, ధాన్యపు దిగుగబడులు తడిసిపోయాయి. అకాల వర్షం రైతన్నలకు నష్టాన్ని మిగిల్చింది.

రైతులను వెంటాడుతున్న అకాల వర్షాలు

కుంటాల, అక్టోబర్, 21 : (ఆంధ్రజ్యోతి) మండలంలో గత కొంత కాలంగా అకాల వర్షాలు రైతులను వెంటాడుతున్నాయి. ప్రస్తుతం సోయా మొక్కజొన్న పంటలు కోతలు కోసి కల్లాల్లో పంటలను ఆరబెడుతున్న రైతులకు అకాల వర్షాలు తీవ్ర ఆటంకాన్ని కలిగిస్తున్నాయి. మరికొద్ది రోజుల్లో వరి పంట కోతకు వచ్చే అవకాశం ఉందని ఇలా వర్షాలు కురిస్తే పంట పొలాల్లో నీరు ఆరకుండా తడిగా ఉండి కోత కోసేందుకు ఇబ్బందులు ఎదుర య్యే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆందోళనలకు గురవుతున్నారు. మండల కేంద్రం కుంటాలతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి కుంటాల సోయా కొనుగోలు కేంద్రంలో పలువురి రైతుల ధాన్యం తడిసింది. మరికొంత మంది రైతులు ముందుగానే టార్ఫలిన్‌లు వేసి ధాన్యం తడవకుండా జాగ్రత్త పడ్డారు. కొనుగోలు కేంద్రంలో సోయా విక్రయించాలంటే సరైన తేమ శాతం రావాలి. తేమ శాతం రావాలంటే ధాన్యాన్ని ఆరబెట్టాలి. ప్రతిరోజు వర్షం కారణంగా ధాన్యాన్ని ఆరబెట్టలేని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు ధాన్యం ఎలా విక్రయించాలనే ఆందోళనలో సతమతమవుతున్నారు.

ఆందోళనలో రైతులు

సారంగాపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆలూర్, బోరిగాం గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం అకాల వర్షం కురిసింది. దీంతో సోయాబీన్, పత్తి, వరి పంటలకు నష్టం వాటిల్లింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికి వచ్చిన సమయంలో అకాల వర్షం కురియడంతో నెలకొరిగాయి. పంట పొలాల నుండి ఇంటికి తీసుకవచ్చే సమయంలో కురిసిన అకాల వర్షానికి పంటలకు నష్టం వాటిల్లడంతో పెట్టిన పెట్టుబడి కూడా రాదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా సోయాబీన్ విక్రయించడానికి మార్కెట్ యార్డ్‌లోకి తీసుకవచ్చే సమయంలో ఈ అకాల వర్షం కురియడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.



భైంసా వారంతపు సంతలో నిలిచిన వర్షపు నీరు





కుంటాల కొనుగోలు కేంద్రంలో వర్షపు నీటి మధ్యన సోయా

రూ.కోటి విలువ చేసే గంజాయి దహనం

● 48 కేసుల్లో, 411 కేజీల గంజాయి స్వాధీనం

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లాలో 48 కేసుల్లో 411 కేజీల గంజాయిని సోమవారం సాయంత్రం నిజామాబాద్‌లో దహనం చేశారు. వివిధ కేసుల్లో పట్టుకున్న గంజాయిని దహనం చేయాలని ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఆదిలాబాద్ ఇచ్చోడ ఉట్నూర్ ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో ఉన్నటువంటి 411 కేజీల గంజాయిని, నిజామాబాద్ జిల్లాలోని మెడికేర్ సర్వీసెస్ ప్రైవే ట్ లిమిటెడ్ కంపెనీలో ఈ గంజాయిని దహనం చేసినట్లు ఆదిలా బాద్ డిప్యూటీ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. దహనం చేసిన గంజాయి విలువ సుమారు రూ.కోటి ఉంటుం దని అధికారులు తెలిపారు. ఆదిలా బాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 340 కేజీలు, ఇచ్చోడలో 37 కేజీలు, ఉట్నూర్‌లో 33 కేజీల గంజాయిని డిస్ట్రాయిడ్ చేశారు. ఈ గంజాయిని ఆదిలాబాద్ ఎక్సైజ్ సూపరిండెంట్ హిమశ్రీ, పోలీస్ స్టేషన్‌లో సీఐలు కలిసి దహనం చేశారు. వివిధ కేసుల్లో పట్టుకున్నటువంటి గంజా యిని దహనం చేసినటువంటి ఆదిలా బాద్ ఎక్సైజ్ అధికారులకు సిబ్బం దికి ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ వీవీ కమలాసన్ రెడ్డి అభినందనలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

సోన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడ్తాల్ గ్రామానికి చెందిన గుర్రం గంగన్న, కొత్త మల్లవ్వ ఇటీవల మృతి చెందారు. సోమవారం బాధిత కుటుంబాలను వేరువేరుగా ఉమ్మడి నిర్మల్ మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు, బాజపా నాయకుడు వి.సత్యనారాయణ గౌడ్ పరామర్శించారు. ప్రగాఢ సంతాపం తెలిపి, మానసిక ధైర్యాన్ని కల్పించారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ సభ్యుడు బర్మ రాజ నర్సయ్య తదితరులున్నారు.



ఆలయంలో భీమన్న ఉత్సవ విగ్రహం

ఆలయానికి తరలివచ్చిన భక్తులు

ఘనంగా భీమన్న జాతర

• వర్షాన్ని సైతం లెక్కచేయకుండా హాజరైన భక్తులు

మామడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా మామడ మండలంలోని కొరిటికల్ గ్రామంలో సోమవారం భీమన్న జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలుచేసి ఆలయ నిర్వాహకులు మొక్కులు చెల్లించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి కాకుండా పక్క జిల్లా నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు హాజరవ్వడంతో పోలీసు వారు భారీ బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా గ్రామఅభివృద్ధి, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యే ఏర్పాట్లు చేశారు.

భారీ వర్షంలోనూ ఆగని జాతర

2 గంటలపాటు భారీ వర్షం కురిసినా భక్తులు మాత్రం వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అధిక సంఖ్యలో భక్తులు హాజరై పూజలు నిర్వహించారు. ప్రతిఏటా ఆనవాయితీగా ఈ పండుగ నిర్వహిస్తామని గ్రామస్థులు తెలిపారు.

భక్తి



భారీ వర్షానికి టార్పాలిన్ కవర్లను కప్పుకుని ఉన్న భక్తులు



ఆలయంలో దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

మార్కెట్ యార్డును సందర్శించిన కలెక్టర్, ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి) జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డును కలెక్టర్ రాజార్షిషా, ఎస్పీ గౌస్‌ఆలంలు సంబంధిత అధికారులతో కలిసి మార్కెట్ యార్డులను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ నెల 23న ప్రారంభం కానున్న పత్తి కొనుగోలు 25వ తేదీకి వాయిదా వేసినట్లు కలెక్టర్ తెలిపారు. రానున్న రెండురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో కొనుగోళ్లను వాయిదా వేశామన్నారు.



మార్కెట్ యార్డును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్, ఎస్పీ

ఫొటో న్యూస్



బాసరలో ఎరువుల కోసం ఎదురుచూస్తున్న రైతులు

ఎరువుల కోసం రైతుల పడిగాపులు!!

బాసర, అక్టోబరు 21: (ఆంధ్రజ్యోతి): ఎరువుల కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. యూరియా, డీఏపీ కోసం సహకార వ్యవసాయ సంఘం చుట్టూ తిరుగుతున్నారు. రేపు మాపు అంటూ చెపుతున్న అధికారులు ఎరువులను మాత్రం అందించడం లేదు. ఈ క్రమంలో ప్రతీ రోజు రైతన్నలు వ్యవసాయ పనులు మానేసి గోదాముల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సోమవారం ఎరువులు వస్తాయని తెలుసుకున్న మండల రైతులు మండల కేంద్రంలోని సహకార సంఘం గోదాంకు ఉదయం 4గంటల నుండే క్యూ కట్టారు. అయినా చివరికి అందరికీ ఎరువులు అందలేదు. చాలామంది రైతులు నిరాశతో వెనుదిరిగారు. మహిళా రైతులు సైతం గంటల తరబడి ఎదురుచూసినా ఫలితం లేదు. బడా రైతులకు ముందస్తు సమాచారం ఇస్తూ కొందరు ఉద్యోగులు ఎరువులు అందేలా చూస్తున్నారని రైతులు వాపోయారు. ఒకటి, రెండు రోజుల్లో రైతులందరికీ ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.



ఎరువుల కోసం మహిళా రైతుల పడిగాపులు

కనిపించని పల్లె వెలుగు!

• మహాలక్ష్మీ పథకానికి నోచుకోని తాంసిలోని గిరిజన మహిళలు • కాలినడకన మైళ్ల దూరం • అవస్థలు పడుతున్న గిరిజనం

తాంసి, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాలు నేటికీ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందలేకపోతున్నాయి. చిన్న పంచాయతీలుగా ఏర్పడితే అభివృద్ధి సాధ్యపడుతుందని కలలు కన్న తెలంగాణ ప్రజలు ఆశలు నెరవేరడం లేదు. కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. పట్టించుకోవాల్సిన ప్రజాప్రతినిధులు అధికార యంత్రాంగం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. కొన్ని మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ బస్సులు లేక మైళ్ల దూరం కాలినడకన ప్రయాణాన్ని సాగించాల్సిన పరిస్థితులు దాపురించాయి. తాంసి మండలంలో 13 గ్రామ పంచాయతీలు, మూడు అనుబంధ గ్రామాలు కలిపి మొత్తం 16 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 32 కిలోమీటర్ల వైశాల్యంలో ఉన్న ఈ మండలం మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఉంది. కప్పర్ల నుంచి సుంకిడి వరకు 11 కిలోమీటర్లు రెండు లైన్ల బీటీ రోడ్డు నిర్మించారు. కానీ ఈ రోడ్డుపై ఇప్పటివరకు బస్సు నడవలేదు. దీంతో మహాలక్ష్మీ పథకానికి గిరిజన మహిళలు నోచుకోవడం లేదని చెప్పవచ్చు. దీంతో మండల కేంద్రం నుంచి అట్నంగూడ వరకు గల 10 కిలో మీటర్ల వరకు కూడా బీటీ రోడ్డు ఉంది. కాని ఈ రోడ్డుపై కూడా ఇప్పటి వరకు పల్లెవెలుగు బస్సు నడవలేదు. దీంతో ఈ రోడ్డుపై ఎనిమిది గ్రామాల ప్రజలు నిత్యం మహిళా దూరం కాలినడకన వెళ్లి వారి ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. మండలంలోని 16 గ్రామాలకు కేవలం నాలుగు గ్రామాలకు మాత్రమే బస్సు సౌకర్యం ఉంది. ఇది కూడా ఒక్కే ట్రిప్పు మాత్రమే. ఇక బేతాళగూడ, అట్నంగూడ, అంబుగావ్, గిరిగావ్, లింబుగూడ గ్రామాలలో వర్షం పడితే పూర్తిగా బురదమయం అవుతాయి. బయటకు వెళ్లలేని పరిస్థితి దాపురించింది. ఎవరైనా బంధువుల ఇళ్లకు వెళ్లాలంటే వారు పడుతున్న ఇబ్బందులు అంతా ఇంతా కాదు.

ఫోకస్



పల్లె వెలుగు బస్సు

• మహాలక్ష్మీ పథకానికి గిరిజన మహిళలు దూరం

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహాలక్ష్మీ పథకాన్ని ప్రారంభించింది. అయితే తాంసి మండలంలోని చాలా గ్రామాలకు బస్సులు నడవకపోవడంతో ఆ పథకానికి మహిళలు దూరం అయ్యారని చెప్పొవచ్చు. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఉచితంగా బస్సును సద్వినియోగం చేసుకుంటున్నప్పటికీ తాంసి మండలంలో మాత్రం ఆ సదుపాయం లేకపోవడంతో మహిళలు ఉచిత ప్రయాణానికి దూరమవుతున్నారు. రేవంత్ సర్కార్ అయినా తమ కష్టాలు తీర్చాలని గిరిజన మహిళలు కోరుతున్నారు.

• ఏ ఊరెళ్లాలన్నా కాలినడకే..

మండలంలోని సుమారు ఏడు గ్రామాల ప్రజలు బంధువుల ఇళ్లకు వెళ్లాలంటే 6 నుంచి 8 కిలో మీటర్ల దూరం కాలినడకనతో వెళ్లాల్సిందే. కాలినడకన వెళితే తప్ప వారు ప్రైవేట్ వాహనాలను బస్సులను ఎక్కే అవకాశం లేదు. దీంతో ముఖ్యంగా గిరిజనులు నిత్యం పడుతున్న బాధలు అంతా ఇంతా కావు. వీరి బాధలను అధికారులు చూస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.



నెత్తి మోతనా వస్తువులను తీసుకుని గ్రామాలకు వెళుతున్న జనం

జరదేఖో!!



బురద మయంగా మారిన రోడ్లు ఇలా..

అది బురద కాల్వ!

• చినుకు పడితే చిత్తడిగా గ్రామం • కొత్త కాలనీలో పడకేసిన పారిశుధ్యం

• పట్టించుకోని అధికారులు

దిలావర్‌పూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అది స్వయంభు లక్ష్మీ నరసింహ వెలసిన గ్రామం.. వేల మంది భక్తులు రాకపోకలు సాగించే కాల్వ గ్రామం.. ప్రస్తుతం ఎటు చూసినా పారిశుధ్యం లోపం తాండవిస్తోంది. అధికారుల అలసత్వానికి అద్దం పడుతోంది. గ్రామాల్లో ప్రజా ప్రతినిధుల పాలన పోయి ప్రత్యేక అధికారుల పాలన వచ్చినా సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి.

• గ్రామమంతా బురదమయం

గ్రామంలో ఏ కాలనీకి వెళ్లినా బురదే దర్శనమిస్తోంది. సీసీ రోడ్లు ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది. సీసీ రోడ్డుకు ఇరుపక్కల బురదతో ఇబ్బందిగా మారింది. కొన్ని కాలనీల్లో మురికి కాలువల్లో పూడిక తొలగించకపోవడంతో వర్షం నీటితో పూడిక రోడ్ల పైకి వస్తోంది. దీంతో ఆయా కాలనీలు మురికితో కంపు కొడుతున్నాయి. నివాస గృహాల మధ్య పెంటకుప్పలు మరింత ఇబ్బందికరంగా మారాయి.

• అస్తవ్యస్తంగా కొత్త కాలనీ

గ్రామంలోని కొత్త కాలనీలో పారిశుధ్యం దారుణంగా తయారైంది రోడ్లన్నీ బురదమయమయ్యాయి. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. రోడ్లకు ఇరువైపులా మురికి నీటి కాలువలు లేకపోవడంతో మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. చినుకు పడితే చాలు రోడ్లన్నీ చిత్తగా మారుతున్నాయని ఆ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ మొత్తం వర్షం నీటిలో తెలియాడుతుందని బయటకు వెళ్లేందుకు కూడా వీలుకాదని అన్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. దోమలు, ఈగలతో వేగలేకపోతున్నామని, పిల్లలతో నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తోందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో పారిశుద్ధ్యం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

• పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులే..

కాల్వ గ్రామంలో రైతులే ఎక్కువ. వారు పంట పొలాలకు వెళ్లేందుకు రోడ్లు ఉన్నప్పటికీ అవి మట్టితో వేసిన రోడ్లు కావడంతో వర్షంతో బురదగా మారాయి. రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడంలేదు. రోడ్లపై మొరం పోయించాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన



మరమ్మతుకు నోచుకోని మరుగుదొడ్లు

బీసీ హాస్టల్‌లో సమస్యల తిష్ట

• మరమ్మతులకు నోచుకోని మరుగుదొడ్లు

• ప్రహరీ లేక హాస్టల్‌లోకి పశువుల సంచారం • పట్టించుకోని అధికారులు

తలమడుగు, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు చదువుతోపాటు పౌష్టికాహారాన్ని అందించాలనే లక్ష్యం నీరుగారిపోతోంది. తలమడుగు మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో సమస్యలు తిష్టవేశాయి. హాస్టల్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలకేంద్రంలో ప్రభుత్వ బీసీ హాస్టళ్లలో అనేక సమస్యలతో విద్యార్థులు సాహసం చేస్తున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీసీ వసతిగృహంలో దాదాపు 100మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కానీ వారికి సరిపడా మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న మరుగుదొడ్లకు తలుపులు లేవు. మరికొన్ని మరు గుదొడ్లు మరమ్మతులకు గురయ్యాయి. వాటిని మరమ్మతులు చేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా వసతి గృహానికి ప్రహరీ కూలిపోయి దాదాపు మూడేళ్లు అవుతున్నా ఇప్పటివరకు గోడ నిర్మాణానికి అధికారులు నిధులు మంజూరు చేయడం లేదు. దీంతో చుట్టుపక్కల గల వ్యవ సాయ పొలాల నుంచి పాములు, తేళ్లు, ఇతర విష జంతువులు హాస్టల్‌లోకి సంచరిస్తున్నాయి. దీంతో విద్యార్థులు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు.



మరమ్మతులకు నోచుకోని చేతిపంపు

వసతి గృహాన్ని తనిఖీ చేసేందుకు వచ్చిన అధికారులు హామీలు ఇస్తున్నారే తప్ప ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం లేదు. అదేవిధంగా వసతి గృహంలో గల తాగునీటి చేతి పంపు మరమ్మతులు గురై నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు అధికారులు మరమ్మతులు చేపట్టడంలేదు. వసతిగృహంలో ఎన్నో సమస్యలు ఉన్నప్పటికీ హాస్టల్ వార్డెన్ నర్సింహులు సహకారంతో ప్రతీ ఏడాది వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి వసతి గృహంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



మండల కేంద్రంలో బీసీ వసతి గృహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వి'చిత్రం'



పగటి పూట వెలుగుతున్న వీధి దీపాలు

పగలే వెన్నెలా..!

• దారి తప్పుతున్న విద్యుత్ వినియోగం

దస్తురాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగం దారి తప్పుతోంది. దస్తురాబాద్ మండల కేంద్రంలో ఓవైపు పగలు వీధిదీపాలు వెలుగుతుండగా.. మరోవైపు ఆశ్రమపాఠశాల విద్యార్థులు ఉండే ప్రాంతంలో వీధిదీపాలు కరువయ్యాయి. విద్యుత్‌ను పొదుపుగా ఉపయోగిస్తూ రాత్రివేళల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేయాల్సిన సిబ్బంది దాన్ని గాలికి వదిలేస్తున్నారు. దీంతో రాత్రివేళల్లో విద్యార్థులు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.2 । కనిష్ఠం 23.4



నిర్మల్
జిల్లా వార్తలు

మంగళవారం 22 అక్టోబరు 2024



ప్రభుత్వ ఆసుపత్రుల్లో హైటెక్ సెక్యూరిటీ



- సందర్శకులకు ఇక విజిటింగ్ పాస్‌లు తప్పనిసరి
- సీసీటీవీలతో నిఘా, పర్యవేక్షణ
- డాక్టర్లు, సిబ్బందిపై దాడుల నిరోధానికి పకడ్బందీ చర్యలు
- వరుస సంఘటనల నేపథ్యంలో స్పందించిన సర్కారు

నిర్మల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఇక హై సెక్యూరిటీ కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగానే ప్రభుత్వ ఆసుపత్రులలో దాడులు, అల్లర్ల నిరోధానికి రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టబోతోంది. దీనికి సంబంధించి వైద్య,ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కార్యాచరణను రూపొందించారు. ఇందులో భాగంగానే భద్రత చర్యలతో పాటు డాక్టర్‌లకు, సిబ్బందికి రక్షణ కల్పించేందు కోసం ఏర్పాటు చేయనున్న కమిటీలకు సంబంధించి మార్గదర్శకాలను రూపొందించారు. హాస్పిటల్స్ సెక్యూరిటీ కమిటీలతో పాటు డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బంది భద్రత కోసం హాస్పిటల్ వైలెన్స్ ప్రివెన్షన్ కమిటీలను కూడా ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించి రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ ప్రత్యేక గైడ్‌లైన్స్‌ను కూడా జారీ చేసింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లోకి వచ్చే వారందరిపై హాస్పిటల్స్ సెక్యూరిటీ కమిటీ ప్రత్యేకనిఘా సారించనుంది. మూడు షిఫ్టులతో భద్రతచర్యలు చేపట్టనున్నారు. ఆసుపత్రుల్లోని ఆస్తుల రక్షణతో పాటు డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది రక్షణ కోసం ఈ కమిటీలు పనిచేయాల్సి ఉంటుంది.

భద్రత, అల్లర్ల నిరోధక కమిటీల బాధ్యతలు

జిల్లా హాస్పిటల్స్‌లలో ఇక విజిటర్ పాసులను తప్పనిసరి చేయనున్నారు. రోగుల బంధువులు వారి దగ్గరి వారు ఎవరూ కూడా ఆసుపత్రుల్లోకి రావాలంటే విజిటర్స్ పాస్ ఉంటేనే వారిని అనుమతిస్తారు. డాక్టర్లు, వైద్య సిబ్బందికి కూడా ఐడెంటిటీ కార్డులను తప్పనిసరి చేయనున్నారు. ఐడెంటిటీ కార్డు ఉంటేనే వారిని విధుల్లోకి అనుమతించనున్నారు. అలాగే హాస్పిటల్స్‌లోని అన్ని చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడమే కాకుండా వాటి సీసీ ఫుటేజీని నిర్ధిష్ట కాల పరిమితి వరకు అందుబాటులో ఉంచనున్నారు. ఆసుపత్రుల్లో ప్రధానమార్గాలు, ముఖ్య మైన చోట్ల భారీకేడ్లను కూడా ఏర్పాటు చేయబోతున్నారు. అ లాగే ఆసుపత్రుల్లోకి వచ్చే వారందరిని స్క్రీనింగ్ చేయనున్నారు. వెంట తీసుకువచ్చే బ్యాగులను తనిఖీ చేసి ఆ బ్యాగుల్లో అభ్యంతరకర వస్తువులు ఉంటే వాటిని స్వాధీనం చేసుకోనున్నారు. దీంతో ఆసుపత్రులలో అన్ని చోట్ల లైటింగ్ సౌకర్యాన్ని అలాగే డాక్టర్లకు డ్యూటీ రూమ్స్, రెస్ట్ రూమ్స్, ప్రత్యేక టాయిలెట్స్ సౌకర్యాన్ని కల్పించనున్నారు. హాస్పిటల్ సెక్యూరిటీ కమిటీలు స్థానిక స్టేషన్ హౌజ్ ఆఫీసర్లతో ఎప్పటికప్పుడు భద్రతపై సంప్రదింపులు జరపడమే కాకుండా వారి సహకారాన్ని తీసుకుంటూ భద్రత చర్యలకు సంబంధించిన సమా చారాన్ని అందించాలని కూడా నిర్ణయించారు. కాగా వైలెన్స్ ప్రివెన్షన్ కమిటీ ఆధ్వర్యంలో 24/7 తరహా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఈ కంట్రోల్ రూమ్‌కు పోలీసుస్టేషన్‌కు అనుసంధానం చేయనున్నారు. అలాగే హాస్పిటల్‌లలో లైగింక వేధింపులకు సంబంధించిన చట్టాలపై ప్రాపర్టీ డ్యామేజ్ నిరోధానికి సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించనున్నారు. ముఖ్యంగా మహిళ డాక్టర్లు, సిబ్బందికి లైగింక పరమైన వేధింపులు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టనున్నారు. అలాగే సెక్యూరిటీపై వైలెన్స్ ప్రివెన్షన్‌పై డాక్టర్లకు, వైద్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నారు. ఈ కమిటీ ప్రతి మూడు నెలలకు ఒకసారి హాస్పిటల్ డెవలప్‌మెంట్‌తో సొసైటీ సమావేశం కావాల్సి ఉంటుంది. నిధుల విషయంలో కూడా హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీతో పాటు రాజీవ్ ఆరోగ్య శ్రీకి సంబంధించిన రివాల్వింగ్ ఫండ్‌ను వినియోగించుకోవాలంటూ ఈ గైడ్‌లైన్స్‌లో వివరించారు.

కమిటీలకు చైర్‌పర్సన్‌లుగా సూపరింటెండెంట్‌లు

కాగా హాస్పిటల్ సెక్యూరిటీ కమిటీ చైర్‌పర్సన్‌గా మెడికల్ సూపరింటెండెంట్, కన్వీనర్‌లుగా స్టేఫీ ఆఫీసర్లు (ఆర్ఎంఓ) వ్యవ హరించ నున్నారు. మెంబర్లుగా స్టేషన్‌హౌజ్ ఆఫీసర్, నర్సింగ్ సూపరింటెండెంట్, బయో మెడికల్ ఇంజనీర్, సెక్యూరిటీ స్టాఫ్ ప్రతినిధి, ఐఎంఏ ప్రతినిధి, సీనియర్ డాక్టర్, సీనియర్ స్టాఫ్‌నర్సు, సీనియర్ సిబ్బందిలో ఒకరు సభ్యులుగా కొనసాగనున్నారు. అలాగే హాస్పిటల్ వైలెన్స్ ప్రివెన్షన్ కమిటీకి కూడా మెడికల్ సూపరింటెండెంట్ చైర్‌పర్సన్‌గా సీనియర్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. మెంబర్లుగా ఇంటర్నల్ కమిటీ చైర్మన్, స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌తో పాటు ఐఎంఏ ప్రతినిధి, హాస్పిటల్స్‌లోని సీనియర్ డాక్టర్లు, సీనియర్ స్టాఫ్ నర్సు సీనియర్ సిబ్బంది సభ్యులుగా వ్యవహరించనున్నారు. అలాగే ఇంటర్నల్ కమిటీలు కూడా నియమించుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖ ఈ గైడ్‌లైన్స్‌లో పేర్కొంది.



మంత్రి శ్రీధర్‌బాబుకు

ఎంబ్రాయిడరీ చిత్రపటం అందజేత



చిత్రపటం మంత్రికి చిత్రపటాన్ని అందజేస్తున్న కళాకారుడు

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు చెందిన శ్రీనివాస్ మంత్రి శ్రీధర్‌బాబు తండ్రి స్వర్గీయ శ్రీపాదరావు ఎంబ్రాయిడరీతో తయారు చేసిన చిత్రపటాన్ని సోమవారం ఆయనకు అందజేశారు. కళాకారుడు శ్రీనివాస్‌తో పాటు ఆయన కుమారులు కార్తీక్, అఖిల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన మాజీ మంత్రి



ఆసుపత్రిని సందర్శించిన మాజీ మంత్రి ఐకే రెడ్డి

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యుదాఘాతంతో అగ్నిప్రమాదం చోటుచేసుకున్న నేపథ్యంలో సోమవారం మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆసుపత్రిని సందర్శించారు. ఘటనపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ప్రమాదం జరుగలేదని ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. అగ్నిప్రమాద ఘటనపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రికి తెలియజేసినట్లు తెలిపారు. పారిశ్రామికవేత్త మురళీధర్‌రెడ్డి, మేడారపు ప్రదీప్, శ్రీకాంత్ యాదవ్, గంగారెడ్డి, మహిపాల్ రెడ్డి, తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

వైద్యుడి ఔదార్యం.. నిరుపేద బాలికకు వైద్యం



కోలుకున్న బాలికతో వైద్య సిబ్బంది

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రానికి చెందిన వైద్యుడు దేవేందర్‌రెడ్డి ఓ నిరుపేద బాలిక పట్ల ఔదార్యం చూపారు. తన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఓ నిరుపేద కుటుంబానికి చెందిన బాలికకు ఖరీదైన వైద్యం అందించి ప్రాణాన్ని కాపాడారు. లక్ష్మణచాంద మండలం తిరుపెల్లి గ్రామానికి చెందిన గాండ్ల నరేష్, స్వప్న దంపతుల కుమార్తె అనుశ్రీ 8వ తరగతి చదువుతోంది. అర్ధరాత్రి నుంచి వాంతులు, కడుపు నొప్పి రావడంతో.. తీవ్ర ఇబ్బంది పడింది. కుటుంబీకులు వెంటనే దేవేందర్ రెడ్డి ఆసుపత్రికి తీసుకురాగా.. అపస్మారక స్థితికి చేరిన బాలికకు సరైన సమయంలో వైద్యం అందించాడు. కృత్రిమ శ్వాస అందించి ప్రాణాలు కాపాడారు. మెరుగైన వైద్యం అందించడంతో ఆ బాలిక తొందరగా కోలుకుంది. ఈ సందర్భంగా అనుశ్రీ కుటుంబీకులు వైద్యులు దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, శ్రావణి, మనోజ్, భరత్‌తో పాటు ఆసుపత్రి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

పట్టభద్రుల ఓటర్లుగా నమోదుకు చర్యలు తీసుకోండి

● రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి

ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ఓటర్లు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. అర్హత గల ఉపాధ్యాయులు, పట్టభద్రులు నవంబరు 6లోగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఓటరు నమోదుకు తీసుకుంటున్న చర్యలను జిల్లాల వారీగా సమీక్షించారు. అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ఓటరు నమోదుపై సూచనలు చేశారు. స్వీప్ ఆధ్వర్యంలో విస్తృత కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. రోజువారీ నమోదు, తిరస్కరణ వివరాలు అందజేయాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, డీఆర్‌వో భుజంగ్ రావు, డీఆర్డీవో విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ముథోల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యం, సోయా పంటలను దళారులకు విక్రయించి నష్టపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి లబ్ధిపొందాలన్నారు. వరి ధాన్యం క్వింటాల్‌కు ఏ గ్రేడ్ ధాన్యంకు రూ. 2,320, బి గ్రేడ్ ధాన్యంకు రూ. 2,300ల మద్దతు ధర ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తీగల వెంకటేష్ గౌడ్, తహసీల్దార్ శ్రీకాంత్, సీఈవో సాయరెడ్డి, నాయకులు కోరి పోతన్న నర్సాగౌడ్, సుదర్శన్, శ్రీనివాస్, నిమ్మ పోతన్న, అంబర్‌సింగ్, మేనేజర్ రిచారాణి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో రికార్డుల తనిఖీ

నర్సాపూర్(జి), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆర్టీఐ సామాజిక కార్యకర్తలు సయ్యద్ కలీం, ముష్కం సుదర్శన్, నరేష్‌లు రికార్డులను తనిఖీ చేశారు. సమాచార హక్కు చట్టం 2005 సెక్షన్-2(జే)1 ద్వారా సమాచారం కోరారు. గత ఎనిమిది నెలలుగా కార్యాలయంలో జారీ చేసిన అగ్రికల్చర్ ఇన్కమ్ సర్టిఫికెట్, పట్టా మార్పిడి చేసిన ఫామ్-7, ధరణి అప్లికేషన్ వివరాలను తనిఖీ చేశారు. దీనికి సంబంధించిన పూర్తి రికార్డులను పరిశీలించారు.



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న దృశ్యం

ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలి : కలెక్టర్



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశానికి హాజరైన అధికారులు

నిర్మల్ అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, రెండు పడక గదుల ఇళ్లు వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల వారీగా ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించినప్పుడు వాటికి సంబంధించిన వివరాలను క్లుప్తంగా రిమార్కుల విభాగంలో పొందుపరచాలని ఆదేశించారు. దరఖాస్తుదారులకు పరిష్కారానికి సంబంధించిన వివరాలను అందజేయాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ప్రధానమంత్రి జనసురక్ష యోజన పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ పథకం వల్ల కలిగే లాభాలను గుర్తించి ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులంతా పీఎం విశ్వకర్మ పథకానికి అధికసంఖ్యలో దరఖాస్తులు చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వీలైనంత ఎక్కువ మందిని తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాల్సిందిగా తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్‌వో భుజంగ్ రావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ను అభినందించిన కలెక్టర్

అటల్ పెన్షల్ యోజన పథకం 2023-24 సంవత్సరంలో జూలై, సెప్టెంబరు నెలల మధ్య త్రైమాసికంలో జిల్లాలోని అన్ని బ్యాంక్‌ల ద్వారా 2,000లకు పైగా దరఖాస్తులు స్వీకరించి లక్ష్యాన్ని పూర్తి చేసినందుకుగాను, కేంద్ర ప్రభుత్వపు పీఎఫ్ఆర్ డీ ఏ నుంచి అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్‌ను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసి అవార్డు పొందినందుకు గాను జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్‌ను అభినందించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరే విధంగా మరింత ఉత్సాహంతో పని చేసి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

సంక్షిప్త సమాచారం

విద్యుదాఘాతంతో గేదె మృతి

నిర్మల్ అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ రూరల్ మండలంలోని తల్వేద గ్రామంలో విద్యుదాఘాతంతో రేగుంట రాజన్నకు చెందిన గేదె మృతి చెందింది. రాజన్న గేదె మేత నిమిత్తం రతన్ అనే రైతు పొలం లోకి వెళ్లగా ఎల్‌టీ లైన్ విద్యుత్ తీగ తెగి పోవడంతో కరెంటు షాక్ తగిలి అక్కడికక్కడే గేదె మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ రూ. 50,000 ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. విద్యుత్ శాఖ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

ఉపాధి హామీ పనుల గుర్తింపుపై గ్రామసభ



ముథోల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముద్గల్, బోరిగాం గ్రామ పంచాయతీలో 2025-26 సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ పనుల గుర్తింపు ఆమోదంపై సోమవారం అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముద్గల్ జీపీ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో బి. శివకుమార్, ఏపీవో శిరీషరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఆనందరావు, ఈసీ యోగేష్, టీఏలు శ్రీలక్ష్మి, భాస్కర్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ దత్తాత్రి, మాజీ సర్పంచ్ బాలేరావు, రామచందర్, ఉప సర్పంచ్ ప్రవీణ్, గణపతి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగం భావితరాలకు స్ఫూర్తి

● ఘనంగా అమరవీరుల వారోత్సవాలను కాగడా వెలిగించి ప్రారంభించిన ఎస్పీ



అమరులకు నివాళులర్పిస్తు కాగడా వెలిగిస్తున్న ఎస్పీ జానకీషర్మిల



నిర్మల్ కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన అమరవీరుల వారోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమరుల స్మారకార్థం కాగడాను వెలిగించారు. ఈ సందర్భంగా పోలీసులను ఉద్దేశించి మాట్లాడుతూ... దేశం కోసం సరిహద్దుల్లో సైనికుడు ఎంత కీలకమో రాష్ట్ర భద్రతలో పోలీసుల ప్రాత అంతే ముఖ్యమన్నారు. ప్రజా అవసరాలను, ప్రజల రక్షణ కోసం పోలీసు వ్యవస్థ ఏర్పడిందన్నారు. శాంతి భద్రతలు, దేశ అంతర్గత భద్రత, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ పోలీసుల ప్రధాన కార్తవ్యమని స్పష్టం చేశారు. శాంతి భద్రతల పరిరక్షణతోనే ప్రజలు సుఖంగా ఉంటారని, గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. 1959 అక్టోబరు 21న భారత సైన్యం చైనా దురాక్రమణకు ఎదిరించిన రోజని ఎంతో మంది పోలీసులు అసులువులు బాశారన్నారు. అలాంటి అమరుల త్యాగాలు స్మరించుకునేందుకే ఈ వారోత్సవాలు జరుపుకుంటున్నామని తెలిపారు. సరిహద్దు లడఖ్‌లో కాపలా ఉన్న సీఆర్పీఎఫ్ జవాన్లు సైతం వీరోచితంగా పోరాడి ప్రాణాలు కోల్పోయారన్నారు. అమరవీరులైన పోలీసు కుటుంబాలను ఆర్థికంగా, మానసికంగా ఆదుకోవడమే వారికి ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. 24 గంటలు కంటిమీద కునుకు లేకుండా చేసే ఉద్యోగం పోలీసులది మాత్రమే అన్నారు. అన్ని వేళల్లో ప్రజారక్షణలో, దేశ పరిరక్షణలో, నేరగాళ్ల నియంత్రణలో పోలీసులు ముందుండి ప్రాణాలర్పిస్తున్నారని అన్నారు. అమరులైన పోలీసు కుటుంబ సభ్యులతో ఎస్పీ మాట్లాడుతూ... వారి సాధక బాధకాలు తెలుసుకున్నారు. వారి సమస్యలు సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వారికి జ్ఞాపికలు అందజేసి రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సూర్య నారాయణ, భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, ఇన్స్‌పెక్టర్లు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులు

ఖానాపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో తమ ప్రాణాలు సైతం అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని ఖానాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సర్కిల్ కార్యాలయ ఆవరణలో గల పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్సై రాహుల్, దస్తురాబాద్ ఎస్సై శంకర్, కడెం ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి, పెంబి ఎస్సై సాయికుమార్, ప్రొబేషనరీ ఎస్సై జుబేర్ సహా పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



ఖానాపూర్‌లో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

పెంబిలో..

పెంబి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలను పెంబి పోలీస్ స్టేషన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ గంగారెడ్డి, సీఐ సైదారావు హాజరయ్యారు. పోలీస్ అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... ప్రజలకు పోలీసులకు ఎలాంటి అవాంతరాలు లేకుండా నిరంతరం ప్రజలతో మమేకమై పని చేస్తున్నాం. గతంలో జరిగిన ఘటనలు చాలా బాధాకరమన్నారు. అనంతరం పెంబి ఎస్సై సాయి కుమార్ ఏఆర్ హెడ్ కాని స్టేబుల్ తండ్రి శివయ్య 1998 సంవత్సరంలో బెల్లంపల్లిలో మావోయిస్టుల చేతిలో మృతి చెందడంతో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీస్ అమరవీరులకు జోహార్లు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పెంబి ఎస్సై సాయి, ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్, దస్తురాబాద్ ఎస్సై శంకర్, పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.